సంపుటి :02 సంచిక :303 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 10, ఫిబ్రవరి 2026


# 'నోట్ల' వర్షం

- ఓటుకు రూ.5 వేల వరకు పంపిణీ
- మున్సిపల్ ఎన్నికల్లో 'మాయా'జాలం
- తెల్లవారితే పోలింగ్.. రాత్రంతా ప్రలోభాల పర్వం
- అభ్యర్థుల మధ్య 'ధన' యుద్ధం

05







# 'పేట' పీఠం ఎవరిది?

## మున్సిపల్ ఎన్నికల్లో దొంతి వర్సెస్ పెద్ది

- చైర్ పర్సన్ గద్దె కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ బిగ్ ఫైట్
- నేడు పోలింగ్.. 30 వార్డుల్లో 120 మంది అభ్యర్థుల భాగ్యోదయం
- నారీమణుల చేతిలోనే అభ్యర్థుల గెలుపోటములు

వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపాలిటీలో రాజకీయ వేడి పీక్ స్టేజ్‌కు చేరుకుంది. సాధారణ ఎన్నికలను తలపించేలా సాగుతున్న ఈ మున్సిపల్ పోరులో గెలుపు గుర్రం ఎక్కేదెవరో అని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్యే అసలైన సమరం సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. వ్యూహ ప్రతివ్యూహాలతో నేతలు చెమటోడుస్తుండగా, బుధవారం జరగనున్న పోలింగ్‌పై అందరి దృష్టి నెలకొంది.

– అక్షరదర్బార్, వరంగల్

02

- భారీగా పోలీసు బందోబస్తు
- 13న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి
- 16న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక

05

# రేపే పోలింగ్

- బ్యాలెట్ బాక్సులు, సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లో ఎన్నికల నగారా మోగింది. 260 వార్డుల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న 1073 మంది అభ్యర్థుల భవితవ్యం నేడు ఓటర్ల చేతుల్లో ఉంది. బుధవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇప్పటికే సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు చేరుకోగా, పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 13న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

– అక్షర దర్బార్, వరంగల్

# ఏసీబీకి చిక్కిన ఎస్సై



- రూ.50 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్

04

# గెలుపెవరిది?

## 'పేట' మున్సిపల్ ఎన్నికల్లో దొంతి వర్సెస్ పెద్ది


- ఎమ్మెల్యే పట్టు.. మాజీ ఎమ్మెల్యే వ్యూహం
- చైర్ పర్సన్ పీఠం కోసం హస్తం - గులాబీ మధ్య బిగ్ ఫైట్
- 30 వార్డులు.. బరిలో 120 మంది అభ్యర్థులు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ
- నారీమణుల చేతిలో భవితవ్యం.. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- ప్రతిష్టాత్మక పోరులో విజయం దక్కేది ఎవరికో
- ఉత్కంఠ రేపుతున్న నర్సంపేట పాలిటిక్స్!

**అక్షరదర్బార్, వరంగల్ :**

మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని వరంగల్ జిల్లా నర్సంపేటలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇక్కడ సాధారణ ఎన్నికల మాదిరిగానే మున్సిపల్ ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఏర్పడటమే ఇందుకు కారణం. అత్యధిక వార్డుల్లో నువ్వా నేనా అనే రీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు తలపడుతున్నారు. ముఖాముఖి పోటీతో ఇక్కడ మొదటి నుంచి ఈ రెండు పార్టీల మధ్య బిగ్ ఫైట్ స్పష్టంగా కనబడుతుంది. కొన్ని వార్డుల్లో బీజేపీ గట్టి పోటీ ఇస్తున్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య సాగుతుంది. ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం తెరపడగా బుధవారం పోలింగ్ జరగనుండటంతో ప్రధాన ప్రత్యర్థులు చివరి ప్రయత్నంగా ఓటర్లకు నగదు పంపిణీ చేసే పనిలో తలమునకలైనట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. వ్యూహ ప్రతి వ్యూహాల అమలుతో పొలిటికల్ హీటెక్కించారు.

### - దొంతి వర్సెస్ పెద్ది

ముఖ్యంగా నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికలు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిగా నడుస్తుండటం విశేషం. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి అభ్యర్థుల ఎంపిక మొదలుకొని వారిని గెలిపించే బాధ్యతలను తమ భుజాన వేసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం దొంతి, బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం పెద్ది విస్తృత ప్రచారంలో పోటీపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో నర్సంపేటలో జరిగిన అభివృద్ధిని పెద్ది ప్రచారంలో ప్రస్తావించగా గత రెండేళ్లలో ఇక్కడ జరిగిన అభివృద్ధిని దొంతి తన ప్రచారంలో ప్రజలకు చెప్పారు. వీరిద్దరు కూడా మెజార్టీ వార్డుల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా నర్సంపేట మున్సిపాలిటీ కైవసం చేసుకోవాలనే పట్టుదల ప్రదర్శిస్తుండటం సర్వత్రా ఆసక్తి రేపుతుంది. ఉత్కంఠ పోరులో ఈ మున్సిపాలిటీ చైర్ పర్సన్ పీఠం ఏ పార్టీని వరించనుందనేది హాట్ టాపిక్ గా మారింది. ఓట్ల లెక్కింపు జరిగే 13వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.




### ముఖాముఖి పోటీ

కొద్ది నెలల క్రితం వివిధ గ్రామాల విలీనంతో నర్సంపేట మున్సిపాలిటీ పెద్దదిగా అవతరించింది 30 వార్డులు కలిగి ఉన్న ఈ మున్సిపాలిటీలో మొత్తం ఓటర్లు ఓటర్ల సంఖ్య 40,968 కి చేరింది వీరిలో పురుషులు 19642 మంది మహిళలు 21328 మంది ఇతరులు ముగ్గురు ఉన్నారు 30 వార్డుల నుంచి 120 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి అభ్యర్థులు పోటీకి దిగారు. కొన్ని వార్డుల్లో వామపక్షాల అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు. బిజెపి అభ్యర్థులు వివిధ వార్డుల్లో గట్టి పోటీ ఇస్తున్నడంతో త్రిముఖ పోటీ ఏర్పడింది. సీపీఎం పార్టీ కూడా ఇక్కడ గెలుపు కోసం పక్క ప్రణాళికతో ముందుకు వెళుతుంది. అయితే ప్రతి వార్డులో కాంగ్రెస్ టీఆర్ఎస్ అభ్యర్థులు నువ్వా నేనా అనే తరహాలో మొదటి నుంచి పోటీ పడుతున్నారు. నర్సంపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవి బిసి మహిళకు రిజర్వు అయింది. ఆయితే ఇక్కడ చైర్ పర్సన్ పదవికి కాంగ్రెస్ నుంచి మొదటి పేరు పెండెం లక్ష్మిరామానంద్, రెండో పేరు ఒర్సు అంజలి అని వినపడుతుండగా బీఆర్ఎస్ నుంచి నాగెల్లి పద్మవెంకటనారాయ ణ, నాగిశెట్టి పద్మ ప్రసాద్ తో పాటు మరొకరు రేసులో ఉన్నట్లు ప్రచారంలో ఉంది. ఇక చైర్ పర్సన్ పదవిని ఆశిస్తున్న అభ్యర్థుల వార్డుల్లో పోటీ మరింత ఎక్కువగా ఉంది. కొద్ది రోజుల నుంచి గెలుపే లక్ష్యంగా గడపగడపకు వెళ్లి ఓటర్లను కలిసిన ఆయా వార్డులోని అభ్యర్థులు ప్రస్తుతం ఓటర్లకు నగదు పంపిణీ చేసే పనిలో ఉన్నట్లు సమాచారం.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- పటిష్ట బందోబస్తులో భూపాలపల్లి
- 450 మంది పోలీసులతో భద్రత.. శాంతియుత ఎన్నికలే లక్ష్యం
- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**అక్షరదర్బార్, భూపాలపల్లి:**

భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఎన్నికల భద్రతా ప్రణాళికను వెల్లడించారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (పాత 144 సెక్షన్) అమలులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో పోలీసు అధికారులకు, సిబ్బందికి బ్రీఫింగ్ నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పాటించాల్సిన నియమావళి, 'చేయవలసినవి – చేయకూడనివి' సిబ్బందికి సమగ్రంగా వివరించారు.

### భద్రతా ఏర్పాట్లు

ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు భారీగా బలగాలను మోహరించారు

– మొత్తం వార్డులు: 30
– పోలింగ్ కేంద్రాలు: 86 (26 లొకేషన్లలో)
– పోలీసు బలగాలు: 450 మంది సిబ్బంది
– అధికారుల విభజన: ఒక అడిషనల్ ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు.
– రూట్ మొబైల్స్: 8 రూట్లలో ప్రత్యేక ఎస్కార్ట్. ప్రతి రెండు రూట్లకు ఒక ఇన్‌స్పెక్టర్, ప్రతి నాలుగు రూట్లకు ఒక డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణ.



### - ప్రత్యేక బృందాలు

స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, పెట్రోలింగ్ టీమ్స్, బ్లూ కోల్ట్స్ నిరంతరం గస్తీ కాస్తాయి. పౌరులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. నిబంధనల ఉల్లంఘనపై కఠిన హెచ్చరికలు జారీ చేశారు.

– పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు అనుమతించబడవు.
– పోలింగ్ బూత్ లోపల సెల్ఫీలు దిగడం పూర్తిగా నిషేధం.
– చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు.

ఈ బ్రీఫింగ్ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు వేయాలంటే ఈ కార్డుల్లో ఒకటి తప్పనిసరి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 11న జరగనున్న ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ కీలక ప్రకటన చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కేవలం ఓటర్ స్లిప్పు మాత్రమే సరిపోదని, ఎన్నికల కమిషన్ సూచించిన 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా చూపాలని ఆయన స్పష్టం చేశారు. అనుమతించబడిన 18 రకాల గుర్తింపు కార్డులు ఇవేనని, పోలింగ్ కేంద్రానికి వెళ్లే ఓటర్లు కింది వాటిలో ఏదో ఒక ఒరిజినల్ కార్డును వెంట తీసుకెళ్లాలని తెలిపారు.

- ఓటర్ గుర్తింపు కార్డు (ఈపీఐసీ)
- ఆధార్ కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్ కార్డు
- భారతీయ పాస్ పోర్టు
- పట్టాదార్ పాస్ పుస్తకం
- రేషన్ కార్డు
- ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు
- ఫొటోతో కూడిన బ్యాంక్ లేదా పోస్టాఫీస్ పాస్ బుక్
- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ ఐడీ కార్డు
- కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు
- ఫొటోతో ఎస్సీ/ఎస్టీ/బీసీ కుల ధృవీకరణ పత్రాలు
- ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్
- దివ్యాంగుల గుర్తింపు కార్డు (సదరం)
- ఎంపీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీల గుర్తింపు కార్డులు
- స్వాతంత్ర్య సమరయోధుల ఐడీ కార్డు
- ఫొటోతో కూడిన ఆయుధ లైసెన్స్
- ఆర్జీఐ (ఆర్జీఐ) జారీ చేసిన ఎన్ పీఆర్ స్మార్ట్ కార్డు.

# పరకాలలో పోలింగ్ కు సర్వం సిద్ధం

- 22 వార్డులు.. 44 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్
- పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్



అక్షర దర్బార్, పరకాల: పురపాలక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని పరకాల పురపాలక సంఘంలోని 22 వార్డులకు బుధవారం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మంగళవారం పరకాల లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ మెటీరియల్ తీసుకొని సరి చూసుకుంటున్న ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఎంతమంది పిఓలు, ఏపీవోలు ఓపివోలు, మైక్రో అబ్జర్వర్లు హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను గురించి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రొజెక్టర్ స్క్రీన్ పెట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డు స్థానాలకు 44 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బస్సులలో బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, టిపిఓ సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చాయైనా బ్రతుకైనా మీతోనే..

## అవకాశం ఇస్తే సేవకురాలిగా పనిచేస్తా

## బీఆర్ఎస్ 12వ వార్డు అభ్యర్థి గంట కళావతి



అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణ 12వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గంట కళావతి ఓటర్లను ఆప్యాయంగా కోరారు. ఆమె మాట్లాడుతూ, "ఇది నాకు చివరి అవకాశం. చాయైనా బ్రతుకైనా మీతోనే ఉంటాను. ఒకసారి ఆశీర్వదించండి" అని విజ్ఞప్తి చేశారు. తాను 12వ వార్డులో పుట్టి పెరిగిన ఆడబిడ్డనని, ప్రతి కుటుంబానికి సుపరిచితురాలినని పేర్కొన్నారు. ఇప్పటికే ఇంటింటికి వెళ్లి ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసినట్టు తెలిపారు. "మాటలతో కాదు.. పనితోనే మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. అందరికీ అందుబాటులో ఉండే సేవకురాలిగా పనిచేస్తాను" అని హామీ ఇచ్చారు. వార్డులోని ప్రతి ఒక్కరిని తన కుటుంబ సభ్యులుగానే భావిస్తానని, వారి సమస్యలను తన సమస్యలుగా తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని గంట కళావతి తెలిపారు."నన్ను మీ ఇంటి ఆడబిడ్డగా, కుటుంబ సభ్యురాలిగా భావించి గెలిపించండి" అని ఓటర్లను హృదయపూర్వకంగా కోరారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: పురపాలక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, మున్సిపల్ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మైదానంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి అంబేద్కర్ స్టేడియంలోని బ్యాలెట్ బాక్స్ లు నిల్వ చేయడానికి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ ఓట్ల లెక్కింపు కొరకు ఏర్పాటు చేయనున్న సింగరేణి మినీ ఫంక్షన్స్ హాల్ ను పరిశీలించి కౌంటర్లు ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న అంశంపై అధికారులకు సూచనలు చేశారు.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ లో 11వ తేదీన జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఓటర్లు నిర్భయంగా రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును వినియోగించుకావాలని సూచించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉండగా 86 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పిఓలు, ఏపీవోలు, ఓపివోలు కు ఎన్నికల నిబంధన ప్రకారం శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు.పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోనా తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత




అక్షర దర్బార్, భీమదేవరపల్లి : ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను బాధితురాలికి మంగళవారం ఎస్సై రాజు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, దొంగిలించబడిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సంబంధిత వివరాలు పోలీస్ స్టేషన్లో నమోదు అవుతాయని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా సంబంధిత బిల్లులు, ఐఎంఈఐ నెంబర్లు భద్రపరచుకోవాలన్నారు.



# 14 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

- వెయ్యి స్తంభాల గుడిలో ఏర్పాట్లు చేయండి :ఎమ్మెల్యే నాయిని
- ఆలయ పరిసరాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

అక్షరదర్బార్, హనుమకొండ : చారిత్రక వేయి స్తంభాల ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆలయ పరిసరాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ రుద్రేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే ఉత్సవాలకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులు ఎండకు ఇబ్బంది పడకుండా భారీ చలువ పందిళ్లు, క్రమబద్ధమైన క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతర తాగునీటి సరఫరా, విద్యుత్ అంతరాయం లేకుండా చూడటం, మెరుగైన పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసి, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని అన్నారు.

## - ట్రాఫిక్, భద్రతా చర్యలు

దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు రవాణా ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ సమన్వయంతో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. భక్తుల భద్రత కోసం నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని, ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, డివిజన్ అధ్యక్షులు కుమార్ యాదవ్, సతీష్, ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఆలయ ఈఓ అనిల్, ఇతర ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్




అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: బుధవారం జరగనున్న ములుగు మున్సిపాలిటీ పోలింగ్ సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు విలువైన తమ ఓటును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన బ్యాలెట్ పత్రాల పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే రూట్, మానిటరింగ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ములుగు మున్సిపాలిటీ లో 20 వార్డులకు గాను 83 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 13వేల 500 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ కెమెరాలు 40 వరకు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించడానికి ఓటర్లు, అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, మున్సిపల్ కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ చైర్మన్ అయితే అవినీతి రహిత పాలన

- కాంగ్రెస్ హామీలు ఫెయిల్
- బీఆర్ఎస్ కు ఓట్లు అడిగే నైతిక అర్హత లేదు
- డా. సిరంగి సంతోష్ కుమార్



అక్షర దర్బార్,పరకాల: పరకాల మున్సిపాలిటీలో బీజేపీ చైర్మన్ పదవి చేపడితే అవినీతి లేకుండా పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని బీజేపీ మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ తెలిపారు. ప్రతి వార్డులో జనరిక్ మెడికల్ షాప్‌లు ఏర్పాటు చేస్తామని, ఇంటి నిర్మాణ పర్మిషన్లు రూపాయి ఖర్చు లేకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హామీలు పూర్తిగా విఫలమయ్యాయని, బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని విమర్శించారు. స్మార్ట్ మున్సిపాలిటీ విధానం అమలు చేసి, ఇంటి పన్నులు పెంచబోమని తెలిపారు. పరకాలకు మెడికల్ కాలేజీతో పాటు వ్యాపార అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొంటూ ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరారు.

# అందరి కృషితోనే మేడారం సక్సెస్

## ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి :మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను ఘనంగా శాంతియుతంగా విజయవంతం చేసినందుకు గాను జిల్లా పోలీసు బలగానికి కృతజ్ఞతగా ములుగు జిల్లా పోలీసు అధికారి కేకాన్ సుధీర్ రామనాథ్ బడాఖానా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జాతరను నిర్వహించే బాధ్యత దక్కడం అదృష్టంగా భవిస్తున్నట్టు తెలియచేసారు. హోంగార్డ్స్ స్థాయి నుండి ఎస్పీ స్థాయి వరకు ప్రతి అధికారి, సిబ్బంది జాతర నిర్వహణలో చూపిన అంకితభావం, కష్టపడి చేసిన సేవలను ప్రశంసించారు. ముఖ్యంగా మేడారం జాతర విధుల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బెటాలియన్ పోలీసు బలగం చేసిన సేవలు అమూల్యమైనవని పేర్కొంటూ, వివిధ జోన్లు, సెక్టార్లలో విధులు నిర్వహించిన ప్రతి పోలీసు సిబ్బందికి, ముక్యంగా జిల్లా పోలీస్ అధికారులకు సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బడాఖానా అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పలువురు పోలీసు సిబ్బంది నృత్యాలు, పాటలు ప్రదర్శించి అందరినీ అలరించారు. అనంతరం ఎస్పీ తో కలిసి పోలీసులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, ఏఎస్పీ ఎటూరునాగారం మనన్ బట్, డీఎస్పీ ములుగు రవీందర్, జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఐలు, ఎస్ఐలు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఏసీబీకి చిక్కిన ఎస్సై

## - రూ.50 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా అరెస్ట్



అక్షరదర్బార్, హైదరాబాద్ : బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, చట్టాన్ని రక్షించాల్సిన ఓ పోలీస్ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. హైదరాబాద్ మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వినయ్, రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడికి సంబంధించిన ఒక కేసు విషయంలో సానుకూలంగా వ్యవహరించేందుకు లేదా విచారణలో వెసులుబాటు కల్పించేందుకు ఎస్ఐ వినయ్ రూ.50 వేలు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు మంగళవారం నిర్దేశిత ప్రాంతంలో ఎస్ఐ వినయ్‌కు నగదు అందజేస్తుండగా, మాటు వేసిన ఏసీబీ బృందం ఆయనను చుట్టుముట్టి పట్టుకుంది. ఎస్ఐ చేతుల నుండి రసాయనాలతో కూడిన నీటి పరీక్ష నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆయన లంచం తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యింది. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్ము రూ.50 వేలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్ అనంతరం ఎస్ఐకి సంబంధించిన నివాసాలు, కార్యాలయంలో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి కీలక పత్రాలను పరిశీలిస్తున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద ఎస్ఐ వినయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం ఏసీబీ ప్రత్యేక కోర్టుకు తరలించనున్నట్లు వెల్లడించారు.

# పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన సీపీ



అక్షర దర్బార్, పరకాల: రేపు జరగనున్న పరకాల మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పరకాల మండల కేంద్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియపై పోలీస్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలు, బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్‌రూంలను అడిషనల్ కలెక్టర్ రవితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా ఓట్ల లెక్కింపు కేంద్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై పోలీస్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పరకాల ఏసీపీ సతీష్‌బాబుకు పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే బ్యాలెట్ బాక్స్‌ల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించి స్ట్రాంగ్‌రూంల ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలు ఎవరూ ఉల్లంఘించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్డీఓ నారాయణ, ఏసీపీ నాగయ్య, ఇన్‌స్పెక్టర్లు క్రాంతి కుమార్, రంజిత్ కుమార్, ఎస్ఐ అశోక్ కుమార్‌తో పాటు పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

## ఎన్నికల వ్యయ పరిశీలకులు శివకుమార్ నాయుడు



అక్షరదర్బార్, నర్సంపేట: రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. నర్సంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి పరిశీలించారు. బ్యాలెట్ పేపర్ల పంపిణీ, కౌంటింగ్ సన్నాహాలు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ సామగ్రి సకాలంలో, సురక్షితంగా కేంద్రాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎన్నికల వ్యయ నియంత్రణ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ భాస్కర్, తహసీల్దార్ రవిచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ గజ్జి ఐలయ్యకు సన్మానం

అక్షర దర్బార్ శాయంపేట : నిరుపేద కుటుంబంలో జన్మించి కష్టాల మధ్య నిలబడి, ప్రజల పక్షాన నిలిచే నాయకుడిగా ఎదిగిన గజ్జి ఐలయ్య పత్తిపాక గ్రామ రాజకీయాల్లో చరిత్ర సృష్టించారని (టీఆర్వీఎస్)తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి, అయాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మొహమ్మద్ మురాద్ (మున్నా) అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పత్తిపాక గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్య ను ఘనంగా సన్మానించారు. అనంతరం మొహమ్మద్ మురాద్ మాట్లాడుతూ. . ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, “అన్న అంటే నేను ఉన్నాను” అనే నినాదాన్ని ఆచరణలో చూపించిన ఆయన, తన రాజకీయ ప్రస్థానాన్ని ఎంపీటీసీగా ప్రారంభించి, గ్రామ పంచాయతీ 2026 ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదాలతో ఘన విజయం సాధించి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు కొనియాడారు.కులం, వర్గం, పార్టీ భేదం లేకుండా గ్రామ ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందిన గజ్జి ఐలయ్య విజయాన్ని అభినందిస్తున్నానని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ గజ్జి ఐలయ్య మాట్లాడుతూ నన్ను నమ్మి ఆశీర్వదించిన గ్రామ ప్రజల రుణం తీర్చుకోవడమే నా లక్ష్యం. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనతో పత్తిపాక గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాను” అని స్పష్టం చేశారు.

# సమ్మె అనుమతి కోరుతూ ఎంపీడీవోకు వినతి

అక్షరదర్బార్, నూగూరు వెంకటాపురం: ఈనెల 12న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. పలు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో మండలంలోని 18 గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు వై.రంజిత్, జె.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, ఏ.మోహన్ రావు, వై.రాము, వై.ప్రవీణ్, పి.శాంతమూర్తి, పి.వెంకటేశ్వర్లు, సిహెచ్.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు పోలింగ్

- బ్యాలెట్ బాక్సులు, సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- భారీగా పోలీసు బందోబస్తు
- 13న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి
- 16న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక








**అక్షరదర్బార్, వరంగల్ :**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు బ్యాలెట్ బాక్సులు, సామాగ్రితో మంగళవారం సాయంత్రం వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. జనగామ, స్టేషన్ గణపురం, వర్ధన్నపేట, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి, ములుగు మున్సిపాలిటీల్లో మొత్తం 260 వార్డులు ఉండగా 1073 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం జనవరి 27న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. 28 నుంచి 30వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరణ కొనసాగింది. దాఖలైన నామినేషన్లను అధికారులు 31న పరిశీలించారు. ఈ నెల 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. అదే రోజు సాయంత్రం ఎన్నికల అధికారులు బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను వెల్లడించారు. దీంతో అభ్యర్థులు 4వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారంలోకి దిగారు.

### - ఓట్ల వేటలో పోటీ

ఇంటింటి ప్రచారంతో ప్రతి మున్సిపాలిటీలో అభ్యర్థులు నేరుగా ఓటర్లను కలిసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు సైతం ఓట్ల వేటలో పోటీపడ్డారు. ఈ నెల 9న సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచారం గడువు ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆయా మున్సిపాలిటీ పరిధిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ అధికారులు సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రితో మంగళవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

### - 13న ఓట్ల లెక్కింపు

ఈనెల 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. అదే రోజు ఎన్నికల అధికారులు ఫలితాలను వెల్లడిస్తారు. ఈనెల 16న చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక జరగనుంది.




# 1100 మందితో బందోబస్తు

- మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జనగామ, స్టేషన్ ఘణపురం, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహణ కోసం 1100 మందికిపైగా పోలీసులను వినియోగించడం జరుగుతోందని, ఇందులో ముగ్గురు డీసీపీలతో పాటు ఐదుగురు అదనపు డీసీపీలు నలుగురు, ఏసీపీలు 11మంది, ఇన్స్పెక్టర్లు125 మంది, ఎస్ఐలు 113 మంది, ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు 515, హోంగార్డ్స్ 226 మంది, వీరితో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్ విభాగాలకు చెందిన సుమారు 168 సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నిక వేళ అదనపు డీసీపీ స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియమించడం జరిగిందని, ఎన్నికలు జరిగే ప్రతి మున్సిపల్ పరిధిలో ఒక ఏసీపీ స్థాయి అధికారి ఇంచార్జ్‌గా ఉంటారని, రూటు మొబైల్స్ టీంలు, షాడో పార్టీలు, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక ఎస్ఐ/ఏఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహిస్తారని, మొబైల్ పార్టీలు నిరంతరం పెట్రోలింగ్ పోలీస్ బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఎవరైన ఎన్నికలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి చర్యలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇలాంటి చర్యలకు ఎవరైన పాల్పడుతున్నట్లు సమచారం అందితే తక్షణమే పోలీసులకు సమచారం అందించాలని సీపీ ప్రజలకు సూచించారు.




# కాంగ్రెస్ పార్టీతోనే 6వ వార్డు అభివృద్ధి

### కౌన్సిలర్ పబ్బ సునీత శ్రీనివాస్ గౌడ్

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఆరో వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పబ్బ సునీత శ్రీనివాస్ గౌడ్ తమకు అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వార్డు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాము గెలిస్తే ఆరో వార్డును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడతామని, యాదవ సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే స్మశాన వాటిక వద్ద పాత నల్లాల బావి నుంచి కొత్త పైపులైన్ నిర్మాణం చేస్తామని చెప్పారు. బతుకమ్మ ఆడే స్థలంలో సీసీ వర్క్ చేపడతామని హామీ ఇచ్చారు.అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయడంతో పాటు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే మాటలతో కాదు పనితోనే అభివృద్ధిని నిరూపిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# నగదు పంపిణీ

- ఓటుకు రూ.3వేల నుంచి రూ.5 వేల వరకు
- రిజర్వ్‌డ్ స్థానాల్లో కూడా తగ్గేదేలే అనే రీతిలో పంపిణీ
- ప్రతి మున్సిపాలిటీ పరిధిలోనూ నగదు పంపిణీలో పోటీ



అక్షరదర్బార్, వరంగల్ : తెల్లవారితే పోలింగ్ జరగనుండటంతో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రలోభాలకు తెరతీశారు. గెలుపే లక్ష్యంగా చివరి ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఓటర్లకు నగదు, మందు, చీరల పంపిణీలో పోటీ పడుతున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి ఆయా మున్సిపాలిటీ పరిధిలో ఈ పంపిణీ మొదలైంది. మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 5 గంటలకు ముగిసిన విషయం తెలిసిందే. మంగళవారం అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఓటర్లకు నగదు, మద్యం, చీరల పంపిణీ చేపట్టారు. ఆయా మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో కొందరు ఎన్నికల ప్రచారం ముగిసేలోపే ఓటర్లకు చీరలను పంపిణీ చేశారు. మరికొందరు మంగళవారం మహిళా ఓటర్లకు చీరలను పంపిణీ చేశారు.

### - నగదు పంపిణీ

మంగళవారం సాయంత్రం నుంచి ఆయా మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అభ్యర్థులు నగదు పంపిణీ ప్రారంభించారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఓటుకు రూ.2వేలకు తగ్గకుండా నగదు పంపిణీ జరుగుతున్నట్లు తెలిసింది. పరకాల, నర్సంపేట, భూపాలపల్లి తదితర మున్సిపాలిటీల్లో ఓటుకు రూ.3 వేల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. జనరల్ వార్డుల్లో, మున్సిపాలిటీ చైర్మన్ పదవి రేసులో ఉన్న అభ్యర్థుల వార్డుల్లో రూ.5000 వరకు నగదు పంపిణీ జరుగుతున్నట్లు తెలిసింది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఇలా పోటీపడి పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. బుధవారం ఉదయం వరకు ఈ పంపిణీ ఓటుకు రూ.5000 దాటే అవకాశం ఉన్నట్లు కనబడుతుంది. ప్రత్యర్థుల్లో ఎవరు కూడా తగ్గేదేలే అనే రీతిలో పంపిణీలో పోటీ పడుతున్నట్లు తెలిసింది.



# ఆర్థిక సహాయం అందజేత

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం ప్రగతిసింగారం గ్రామానికి చెందిన బొచ్చు సమ్మక్క అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బోనపల్లి రఘుపతిరెడ్డి 5000 రూపాయలు తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు.ఇట్టి ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుమారుడు బొచ్చు నాగరాజు కాంగ్రెస్ నాయకులు అందజేశారు.అనంతరం వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డ్ మెంబర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర సమరయోధుడు మృతి



అక్షర దర్బార్, మొగుల్లపల్లి: మొగుళ్ళపల్లి మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు చిలుకూరి వెంకట్రాంరెడ్డి అనారోగ్య కారణాలతో హైదరాబాదులో మృతి చెందారు మృతునికి భార్య ఒక కుమార్తె ముగ్గురు కుమారులు ఉన్నారు




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915